సాక్షి పార్వతీపురం మన్యం

ఆదివారం । 13 । జూలై । 2025

నిర్లక్ష్యం..!

జిల్లాలో విద్యుత్ ప్రమాదాల బారిన పడి పలువురు మృత్యువాత పడుతున్నారు. ప్రజలతో పాటు పశువులు కూడా మృత్యువాత పడుతున్నాయి.



- 8లో



పీడీఎస్ బియ్యం పట్టివేత

పూసపాటిరేగ మండలం తిప్పలవలసలో 40 బస్తాలు, పి.కోనవలస చెక్‌పోస్టు వద్ద 34.80 టన్నుల పీడీఎస్ బియ్యంను విజిలెన్స్ అధికారులు సీజ్ చేశారు. - 8లో



సమస్యల పరిష్కారానికి దివ్యాంగుల ఆందోళన - 8లో

దివ్యాంగుల సమస్యలను పరిష్కరించాలని దివ్యాంగుల పరిరక్షణ సేవా సమితి డిమాండ్ చేసింది.

న్యూస్‌రీల్

చెట్లు నరకొద్దు.. వన్యప్రాణుల ఆగ్రహానికి గురికావద్దు..



బహుమతి పొందిన కార్టూన్ ఇదే



పల్ల పరిశినాయుడు

గరుగుబిల్లి: అడవిలో ఉన్న చెట్లను నరుకుతూ వన్యప్రాణుల ఆగ్రహానికి గురికావద్దన్న సందేశాన్నిచ్చేలా వేసిన కార్టూన్ జాతీయ స్థాయి బహుమతికి ఎంపికైనట్టు నాగూరు గ్రామానికి చెందిన నఖచిత్రకారుడు పల్ల పరిశినాయుడు శనివారం తెలిపారు. విశాఖ సంస్కృతి మాసపత్రిక 13వ వార్షికోత్సవం సందర్భంగా ఎన్‌సీసీఎఫ్ సౌజన్యంతో నిర్వహించిన జాతీయ స్థాయి కార్టూన్ పోటీల్లో చెట్లను నరకవద్దన్న సందేశాన్నిచ్చే కార్టూన్ బహుమతికి ఎంపికైందన్నారు. వచ్చేనెల 10న విశాఖపట్నంలో ద్వారకానగర్‌లో ఉన్న పబ్లిక్ లైబ్రరీలో ప్రదానం చేయనున్నట్టు తెలిపారు.

పేరు మార్చడం.. ఏమార్చడమేనా విజనరీ పాలన?

- చంద్రబాబు పాలనా తీరుపై అరకు ఎంపీ గుమ్మ తనూజారాణి ఎద్దేవా




మాట్లాడుతున్న అరకు ఎంపీ గుమ్మ తనూజారాణి

గుమ్మలక్ష్మీపురం: వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజల సంక్షేమం కోసం అమలు చేసిన సంక్షేమ పథకాల పేర్లు మార్చడం, వాటిని అమలు చేయకుండా ఏమార్చడమే చంద్రబాబునాయుడు విజనరీ పాలన అని అరకు పార్లమెంట్ సభ్యులు గుమ్మ తనూజారాణి ఎద్దేవా చేశారు. జియ్యమ్మవలస మండలంలో శనివారం నిర్వహించిన వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశంలో పాల్గొనేందుకు వచ్చిన ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తల్లికి వందనం పథకాన్ని రూపకల్పన చేసినది విద్యాశాఖ మంత్రి నారాలోకేశ్ అంటూ చెప్పుకురావడం సిగ్గుచేటన్నారు. జగన్‌మోహన్ రెడ్డి అమలుచేసిన అమ్మఒడి పథకానికి పేరును మార్చేసి, ఓ ఏడాది పథకం ఎగ్గొట్టి, తీరా తామే రూపకల్పన చేసినట్టు చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. వైఎస్సార్ రైతు భరోసా పథకానికి అన్నదాత సుఖీభవగా పేరుమార్చారే తప్ప ఇప్పటివరకు పైసా సాయం రైతన్నల ఖాతాలో జమచేయకపోవడం విచారకరమన్నారు. చంద్రబాబు విజనరీ పాలన అంటే జనాన్ని మోసం చేయడమేనన్నారు.

ఇష్టంతో చదివితే విజయం మీదే..

నెల్లిమర్ల: కష్టంతో కాకుండా ఇష్టంతో చదివితే విజయం వరిస్తుందని రాష్ట్ర బీసీ సంక్షేమ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్.సత్యనారాయణ విద్యార్థులకు సూచించారు. నెల్లిమర్ల పట్టణంలోని మహాత్మా జ్యోతిబా పూలే బీసీ సంక్షేమ మత్స్యకార బాలుర గురుకుల పాఠశాలను ఆయన శనివారం సందర్శించారు. విద్యార్థుల కోసం వండిన ఆహార పదార్థాలను రుచిచూశారు. అనంతరం ఉపాధ్యాయులు, విద్యార్థులతో మాట్లాడారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు పట్టుదలతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. సిబ్బంది పలు సమస్యలపై ఆయనకు వినతిపత్రాలు అందజేశారు.

పింఛన్ ఎప్పుడిస్తారు 'బాబు'..



చిత్రంలో పిల్లలతో కలిసి తన ఆవేదనను సీపీఎం నాయకులకు వివరిస్తున్న మహిళ పేరు మెల్లిక సరస్వతి. పార్వతీపురం మండలం సంగంవలస పంచాయతీ పరిధిలోని సీతంపేట గ్రామం. ఆమె భర్త ఏడాదిన్నర కిందట అనారోగ్యంతో మృతి చెందారు. ఆమెకు ఐదుగురు పిల్లలు. వీరిలో ఇద్దరు వసతిగృహాల్లో ఉంటూ చదువుతున్నారు. మిగిలిన ముగ్గురు పిల్లలను సాకేందుకు ఆమె ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటోంది. పింఛన్ మంజూరు చేయాలంటూ అధికారుల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నా ఫలితం కనిపించడం లేదు. పింఛన్ జాబితాలో పేరున్నా డబ్బులు అందజేయడం లేదు. అధికారులు స్పందించి ఆదుకోవాలంటూ ఆమె వేడుకుంది.

- పార్వతీపురం రూరల్

డ్రోన్లతో నిరంతర నిఘా

- మరింతగా సీసీ కెమెరాల వినియోగం
- గంజాయి, ఇతర మత్తు పదార్థాల రవాణాపై ఉక్కుపాదం
- విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు
- ప్రజల అప్రమత్తతతోనే సైబర్ నేరాలకు అడ్డుకట్ట
- యువత చెడు వ్యసనాలకు బానిస కావొద్దు
- 'సాక్షి'తో జిల్లా ఎస్పీ ఎస్‌వీ మాధవ్‌రెడ్డి



ఎస్పీ మాధవ్‌రెడ్డి

సాక్షి ఇంటర్వ్యూ

సాక్షి, పార్వతీపురం మన్యం/పార్వతీపురం రూరల్: 'గంజాయి రవాణా, వినియోగంపై నిరంతర నిఘా ఉంది. ఆన్‌లైన్ సర్వే 7,841 మందితో చేశాం. వారు చెప్పిన వివరాల ప్రకారం హాట్‌స్పాట్‌లు గుర్తించి, అనుమానితులపై ఓ కన్నేసి ఉంచామ'ని జిల్లా ఎస్పీ ఎస్‌వీ మాధవ్‌రెడ్డి తెలిపారు. యువత, కొంతమంది విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిసై, అసాంఘిక కార్యకలాపాలకు, ఈవ్‌టీజింగ్‌కు పాల్పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కేసుల్లో ఇరుక్కొని బంగారు జీవితాన్ని నాశనం చేసుకోవద్దని, కన్నవారి ఆశలను కూల్చేయవద్దని హితవు పలికారు. పోక్సో చట్టంపై యువత, మగవారికీ సంపూర్ణ అవగాహన అవసరమని అభిప్రాయం వ్యక్తం చేశారు. 'సాక్షి'తో ఆయన ముఖాముఖి మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలను వివరించారు. ఆ వివరాలు ఎస్పీ మాటల్లోనే...

సరిహద్దుల వద్ద పటిష్ట నిఘా

సరిహద్దు రాష్ట్రం వెంబడి గంజాయి, నాటుసారా అక్రమంగా ప్రవేశిస్తోంది. ఆయా ప్రాంతాల్లో నాలుగు చెక్‌పోస్టుల ద్వారా తనిఖీలు ముమ్మరం చేశాం. సీసీ కెమెరాలను పెట్టి 24 గంటలూ పరిశీలిస్తున్నాం. పాఠశాలలు, కళాశాలలు, ఇతర చోట్ల గంజాయి, ఇతర మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలను ఈగల్ టీంతో కలిసి వివరిస్తున్నాం. సీఆర్‌పీఎఫ్‌తో కలిసి రైళ్లలో తనిఖీలు చేపడుతున్నాం. 25 గంజాయి అనుమానిత ప్రదేశాలున్నాయి. ఈ ఏడాది ఇప్పటి వరకు 11 గంజాయి కేసులు నమోదయ్యాయి. 1,875.225 కిలోల గంజాయిని సీజ్ చేశాం. 12 వాహనాలను సీజ్ చేసి, 21 మందిని అరెస్టు చేశాం.

ప్రధాన ప్రాంతాల్లో సీసీ కెమెరాలు

నేరాలు, అసాంఘిక కార్యకలాపాల కట్టడికి సీసీ కెమెరాల వ్యవస్థను పటిష్టం చేశాం. 1,500 కెమెరాల వరకు బిగిస్తున్నాం. వ్యాపారులు, బహుళ అంతస్తుల యజమానుల సహకారం కూడా తీసుకుంటున్నాం. వారి వ్యాపార సంస్థలు, ఇళ్ల వద్ద సీసీ కెమెరాలు పెట్టేలా చైతన్యం చేస్తున్నాం. బహిరంగ ప్రదేశాలు, ప్రధాన కూడళ్ల వద్ద ప్రధానంగా ఏర్పాటు చేస్తున్నాం. దాతల సహకారమూ తీసుకుంటున్నాం. పాలకొండ, సాలూరు, ఇతర గ్రామీణ ప్రాంతాల్లోనూ వీటిని బిగించనున్నాం. ప్రతి గ్రామం ప్రవేశం, బయటకు వెళ్లే చోట సీసీ కెమెరాలు పెట్టాలన్న ఆలోచన ఉంది. ఇటీవల జరిగిన సాలూరు శ్యామలాంబ పండగలో 50 వరకు నిఘా నేత్రాలు పెట్టాం.

సాంకేతికను వినియోగించుకుంటూ ముందుకు...

కేసుల ఛేదనలో విస్తృతంగా సాంకేతికను వినియోగించుకుంటున్నాం. దీనిపై సిబ్బందికి అవసరమైన శిక్షణ ఎప్పటికప్పుడు ఇస్తున్నాం. క్రైం డేటా, ఇన్వెస్టిగేషన్ టూల్స్, కొత్త చట్టాలపైన అవగాహన కల్పిస్తున్నాం. ఇటీవల కాలంలో సైబర్ నేరాలు అధికమవుతున్నాయి. ఈ కేసులను ఛేదించడంలో సాంకేతికత ముఖ్యం. నేడు ప్రతి ఒక్కరి చేతుల్లోనూ సెల్‌ఫోన్లు ఉంటున్నాయి. లావాదేవీలన్నీ వాటి ద్వారానే జరుగుతున్నాయి. ఇదే అదునుగా సైబర్ నేరాలు పెరుగుతున్నాయి. వీటిని అరికట్టేందుకు బ్యాంకర్లతోనూ సమావేశాలు పెడుతున్నాం. బ్యాంకులకు సంబంధం లేదన్నట్లు ఉంటే ఎలా అవుతుంది? ప్రజలకూ మహిళా పోలీసులతో అవగాహన కల్పిస్తున్నాం. సైబర్ నేరాల్లో బాధితులు పోగొట్టుకున్న నగదులో ఇప్పటి వరకు రూ.7 లక్షల వరకు రికవరీ చేయగలిగాం.

కీలకంగా డ్రోన్ పోలీసింగ్

డ్రోన్ పోలీసింగ్‌తో నిఘా పటిష్టం చేశాం. ప్రస్తుతం మూడు డ్రోన్లు ఉన్నాయి. స్టేషన్‌కు ఒక డ్రోన్ కేటాయించాలన్న కార్యాచరణ ప్రణాళిక ఉంది. జూదం, లిక్కర్, అసాంఘిక కార్యకలాపాల మీద దృష్టి సారించాం. నాటుసారా, గంజాయి వంటి కేసులను పట్టుకునేందుకు అటవీ ప్రాంతాల్లోనూ వీటిని వినియోగిస్తున్నాం. పండగలు, సంబరాలు, నిరసనలు, రాజకీయ పార్టీల ర్యాలీలు.. ఇలా ఎటువంటి కార్యక్రమాలపైనైనా డ్రోన్ కన్ను ఉంటుంది.

ఈ నంబర్లను గుర్తుంచుకోండి

నేరాల నియంత్రణకు ప్రజల సహకారం అవసరం. కొన్ని టోల్‌ఫ్రీ నంబర్లను గుర్తుంచుకోవాలి. అవసరమైన సందర్భంలో వాటిని సంప్రదించడం ద్వారా పోలీసు శాఖకు సహకరించాలి.

సైబర్ నేరాలు జరిగితే..	డ్రగ్స్ రవాణా, వినియోగంపై	మహిళలు ప్రమాదంలో ఉంటే..
1930	1972	112

ప్రజల క్షేమం.. పోలీసుల సంక్షేమం

ప్రత్యేకంగా ప్రతి సోమవారం ఎస్పీ కార్యాలయంలో పీజీఆర్‌ఎస్ కార్యక్రమం నిర్వహిస్తూ.. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరిస్తున్నాం. పీజీఆర్‌ఎస్‌కు ఎక్కువగా భూసమస్యలు, కబ్జాలు, కుటుంబ సమస్యలు, చీటింగ్ నేరాలపైనే అధికంగా ఫిర్యాదులు ఉంటున్నాయి. చాలా వరకు కేసులను నిర్దిష్ట వారం రోజుల్లోగా పరిష్కరించాలని సిబ్బందికి ఆదేశిస్తున్నాం. మరోవైపు పోలీసుల సంక్షేమానికీ చర్యలు తీసుకుంటున్నాం. వారితో ప్రత్యేకంగా విడివిడిగా సమావేశమై సమస్యలు తెలుసుకుంటున్నాం. వారి ఆరోగ్యాన్ని జాగ్రత్తగా ఉంచుకోవాలి. అందుకే తరచూ వైద్యశిబిరాలు నిర్వహించి, ఆరోగ్య తనిఖీలు చేయిస్తున్నాం. వివిధ కారణాలతో పోలీసులు ప్రమాదాలకు గురైనా, మరణించినా.. ఆ కుటుంబాలకు సత్వరం పరిహారం, ఇతర బెనిఫిట్స్ అందేలా చూస్తున్నాం. స్టేషన్‌కు వచ్చే ప్రజల పట్ల మర్యాదగా, శాంతంగా వ్యవహరించాలని సిబ్బందికి సూచిస్తున్నాం. పార్వతీపురం, పాలకొండల్లో పోలీసు శాఖ ఆధ్వర్యంలో వెల్ఫేర్ పెట్రోల్ బంకులు ఏర్పాటు చేశాం. ఇందులో వచ్చిన లాభాలు పోలీసు సంక్షేమానికే వినియోగిస్తాం.

ర్యాలీలు, సభలకు అనుమతి తప్పనిసరి

ర్యాలీలు, పెద్ద సమావేశాలు, సభలు నిర్వహించేటప్పుడు కచ్చితంగా పోలీసుల నుంచి అనుమతిపత్రం తీసుకోవాలి. క్రమశిక్షణ, బాధ్యత ఉండాలన్నదే మా ఉద్దేశం. ఎవరు నిర్వహిస్తున్నారు, ఎంత మంది పాల్గొంటున్నారన్న వివరాలు తెలియజేయాలి. ప్రజల భద్రత, రక్షణ కూడా మాకు ముఖ్యమే. అటువంటి కార్యక్రమాలు ప్రశాంతంగా జరగాలన్నదే మా ఆలోచన. అందరూ సహకరించాలి.

క్రైం రేటు తగ్గింది..

గతంతో పోల్చుకుంటే క్రైం రేటు తగ్గింది. రోడ్డు ప్రమాదాలు కొంత పెరిగాయి. హెల్మెట్ లేకపోవడం వల్లే అధిక ప్రమాదాల్లో మరణాలు సంభవిస్తున్నాయి. ఏజెన్సీలో ఒంపుల రహదారుల వల్ల ఎక్కువగా ఆటో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. బహిరంగ మద్యపానం, డ్రంక్ అండ్ డ్రైవ్‌పై నిరంతర తనిఖీలు ఉంటున్నాయి. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై జరిమానా విధిస్తున్నాం. సంకల్పం, నవోదయం-2 వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. పార్వతీపురం, సాలూరు, పాలకొండ ప్రాంతాల్లో మూడు శక్తి బృందాలు ఉన్నాయి. శక్తి వారియర్ కమిటీలు 1,857 పని చేస్తున్నాయి. ఈవ్‌టీజింగ్, మహిళల పట్ల నేరాలకు సంబంధించి ఈ బృందాలు అవగాహన కల్పిస్తున్నాయి. గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి విద్యార్థులకు వివరిస్తున్నాం. ఇప్పటి వరకు 4,709 అవగాహన కార్యక్రమాలు నిర్వహించాం. 1,228 కౌన్సెలింగ్‌లు చేపట్టాం. పాఠశాలలు, కళాశాలల్లో 354 ఈగల్ క్లబ్స్ ఏర్పాటు చేశాం. ముఖ్య ప్రదేశాల్లో సమాచారం కోసం 62 డ్రాప్ బాక్స్‌లను ఏర్పాటు చేశాం.

తల్లికి వందనం రాలే..
పింఛన్ అందలే!

- మంత్రి డోలా ఎదుట ప్రజల ఆవేదన
- కొన్ని ఇళ్లకే పరిమితమైన 'సుపరిపాలన తొలి అడుగు'
- టీడీపీలో మరోసారి బయటపడిన విభేదాలు



మంత్రికి సమస్యలు వివరిస్తున్న వృద్ధురాలు



వాగ్వాదం చేసుకుంటున్న టీడీపీ శ్రేణులు

సాక్షి, పార్వతీపురం మన్యం: అర్హత ఉన్నా తమకు ప్రభుత్వ పథకాలేవీ అందడం లేదని పలువురు ప్రజలు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి ఎదుట ఏకరవు పెట్టారు. మంత్రి డోలా శనివారం జిల్లాలో పర్యటించారు. పార్వతీపురం పట్టణంలోని 30, 1వ వార్డుల్లో జరిగిన సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్రతో కలిసి పాల్గొన్నారు. కేవలం ముందుగా అనుకున్న కొన్ని ఇళ్లకే వెళ్లి, ప్రజల అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్థానికులు కొంతమంది పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. మంచినీటి సమస్య తీవ్రంగా ఉందని జగన్నాథపురం ప్రజలు తెలిపారు. బోధకాలతో బాధ పడుతున్న తనకు పింఛన్ ఇవ్వాలని.. పక్షవాత రోగి అయిన తన భర్త వెంకటస్వామికి పింఛన్ మొత్తం రూ.6 వేలకు పెంచాలని రాములమ్మ అనే వృద్ధురాలు కోరారు. తనకు పింఛన్ ఇప్పించాలని రాగోలు రామలక్ష్మి విజ్ఞప్తి చేశారు. తన కుమారుడు సాయిగణేష్‌కు తల్లికి వందనం పథకం లబ్ధి కలగలేదని తల్లి ప్రభ ప్రశ్నించారు. పింఛన్ మంజూరైనట్లు పేరు వచ్చిందిగానీ.. ఆ మొత్తం ఇవ్వడం లేదని సుంకరి లక్ష్మి తెలిపారు. తన ఇంటికి ఫ్యాన్, లైటు తప్ప ఇంకేమీ లేవని.. విద్యుత్తు బిల్లు అధికంగా వచ్చిందని సుంకరి గోపాలమ్మ వాపోయారు. విద్యుత్తు బిల్లు సమస్యపై సుంకరి రమణమ్మ సైతం మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. టిడ్కో గృహాలు ఇప్పటికీ అందించలేదని గంటేడ హేమలత, పి.రమణమ్మ, రాగోలు ఉమ, గరుగుబిల్లి ఉమ తదితరులు వాపోయారు. తనకు ఇల్లు మంజూరు చేయాలని కోరాడ ఉష కోరారు. అన్నింటికీ ఎమ్మెల్యేను చూపిస్తూ.. మంత్రి డోలా అక్కడ నుంచి వెనుదిరిగారు.

మరోసారి విభేదాలు బహిర్గతం

టీడీపీలో మరోసారి విభేదాలు బహిర్గతమయ్యాయి. మంత్రి పర్యటన సమయంలోనూ వెలుగుచూశాయి. 'మా వార్డులో మమ్మల్ని కాదని.. ఎవరెవరినో ప్రోత్సహిస్తున్నారు. ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికి ప్రాధాన్యమిస్తున్నారు. కార్యక్రమాలకు కూడా చెప్పడం లేద'ని పలువురు టీడీపీ నాయకులు, మహిళలు వాదనకు దిగారు. స్థానిక ఎమ్మెల్యే విజయచంద్ర ఇతర పార్టీల వారిని ప్రోత్సహిస్తూ, ఎన్నో ఏళ్లుగా టీడీపీని నమ్ముకున్న వారిని విస్మరిస్తున్నారని ఇప్పటికే పలు వార్డుల్లో బహిరంగంగా విమర్శలకు దిగుతున్న విషయం విదితమే. రెండు రోజుల క్రితం జరిగిన సుపరిపాలన కార్యక్రమంలోనూ పలువురు యువకులు ప్రశ్నించారు. తాజాగా జరిగిన మంత్రి పర్యటనలోనూ మరోసారి ఈ విషయం బహిర్గతమైంది.

ఆరోగ్యం, భద్రతే ప్రధానం



సమావేశంలో మాట్లాడుతున్న సాంఘిక సంక్షేమశాఖ మంత్రి శ్రీబాల వీరాంజనేయ స్వామి

పార్వతీపురంటౌన్: జిల్లాలోని గురుకులాలు, వసతి గృహ విద్యార్థుల ఆరోగ్యం, భద్రత పట్ల రాజీపడవద్దని సాంఘిక సంక్షేమం, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమం, గ్రామ/వార్డు సచివాలయాల శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి వసతి గృహ వార్డెన్లను ఆదేశించారు. గురుకులాలు, వసతి గృహాల్లోని ప్రవేశ ఖాళీలన్నీ భర్తీ కావాలని, గ్రామాల్లో తిరిగి విద్యార్థుల ప్రవేశాలు జరిపించాలన్నారు. తల్లితండ్రులు లేని విద్యార్థులకు ప్రవేశాల్లో ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో పార్వతీపురం, విజయనగరం జిల్లాలకు చెందిన అధికారులతో శనివారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో మంత్రి మాట్లాడారు. రాష్ట్రంలోని ఎస్సీ వసతి గృహాల మరమ్మతులకు రూ.143 కోట్లు నిధులు కేటాయించగా, జిల్లాకు రూ. 3 కోట్లు మంజూరు చేసినట్టు వెల్లడించారు. వసతిగృహాల్లోని నిల్వ బియ్యాన్ని వెనక్కితెప్పించి, నాణ్యమైన బియ్యాన్ని పంపిణీ చేయాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణులయ్యేలా వార్డెన్లు ప్రత్యేక శ్రద్ధచూపాలన్నారు. అవసరమైతే ట్యూటర్లను నియమించాలని సూచించారు. గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది, గ్రామీణ నీటి సరఫరా విభాగం సిబ్బంది ఎప్పటికప్పుడు నీటి పరీక్షలు నిర్వహించాలని చెప్పారు. సమావేశంలో ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర, జేసీ ఎస్.ఎస్.శోభిక, ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా రెవెన్యూ అధికారి కె.హేమలత, పార్వతీపురం, విజయనగరం జిల్లా సాంఘిక సంక్షేమ, సాధికారత అధికారులు ఇ.అప్పన్న, ఎం.అన్నపూర్ణ, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ఎం.వెంకటేశ్వరరావు, డ్వామా పీడీ కె.రామచంద్రరావు, వసతి గృహ సంక్షేమ అధికారులు, తహసీల్దార్ సురేష్, తదితరులు పాల్గొన్నారు.

- సాంఘిక సంక్షేమ గురుకులాల్లో పనిచేస్తున్న సీఆర్టీలను రెగ్యులర్ చేయాలంటూ మంత్రికి వినతి పత్రం అందజేశారు.


నందివానివలస పరిసరాల్లో ఏనుగులు



నందివానివలస పామాయిల్ తోటలో సంచరిస్తున్న ఏనుగులు

గరుగుబిల్లి: గత ఇరవై రోజుల నుంచి సీతానగరం, బలిజిపేట మండలాల్లో సంచరించిన ఏనుగులు మళ్లీ గరుగుబిల్లి మండలం నందివానివలస పరిసరాల్లోకి చేరుకున్నాయి. పామాయిల్ తోటల్లో సంచరిస్తూ ధ్వంసం చేస్తున్నాయి. వరి ఉభాలు సమయంలో ఏనుగుల సంచారంతో పొలాలకు వెళ్లేందుకు రైతులు భయపడుతున్నారు. ఏనుగుల తరలింపునకు కూటమి నేతలు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నమ్మండి.. ఇది తాగునీరే..!



పాలకొండ నగరపంచాయతీ ప్రజలను గత కొంతకాలంగా తాగునీటి కష్టాలు వెంటాడుతున్నాయి. కుళాయిల నుంచి మురుగునీరు సరఫరా అవుతుండడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో కుళాయిల నుంచి నీటిని సరఫరా చేసిన అరగంట సమయం వరకు మురుగునీరే వస్తోంది. మురుగు కాలువల్లో ఉన్న పైపులైన్లు శిథిలం కావడమే దీనికి కారణం. ఇదే విషయాన్ని ఇటీవల సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో పాలకొండలోని పలు వార్డుల్లో పర్యటించిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్ దృష్టికి మహిళలు తీసుకెళ్లినా సమస్యను పరిష్కరించలేదు. ప్రజలకు నీటి కష్టాలు తప్పడం లేదు. దీనికి నక్కలపేట ప్రాంతంలో శనివారం కుళాయిల నుంచి వచ్చిన ఈ మురుగునీరే నిలువెత్తు నిదర్శనం.

- పాలకొండ

పెద్దగెడ్డ.. పూడికలకు అడ్డా..!




చిత్రంలో పూడికలు, జంగిల్‌తో నిండినది జీగిరాం సమీపంలోని పెద్దగెడ్డ కాలువ. ఖరీఫ్ సాగుకు రైతులు సిద్ధమైనా కాలువను బాగుచేసేందుకు చర్యలు తీసుకోవడంలేదు. ప్రాజెక్టులో సమృద్ధిగా నీరున్నా ఈ ఏడాది పొలాలకు అందుతుందోలేదోనన్న బెంగ రైతన్నను వెంటాడుతోంది.



చిత్రం చూశారా... ఇది కూడా పెద్దగెడ్డ కాలువే. టెండర్ నిబంధనల మేరకు ఫిబ్రవరి నెలలోనే కాంట్రాక్టర్ పనులు చేపట్టారు. చకచకా పూడికల తొలగింపు పనులు సాగుతున్న తరుణంలో స్థానిక నేత అధికారులపై ఒత్తిడి తెచ్చిమరీ పనులను ఆపించేశారు. అంతే.. ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. రైతన్నకు శాపంగా మారాయి.

- పాలకుల పంతం.. రైతన్నకు శాపం
- ఖరీఫ్ పనులు ప్రారంభమైనా కాలువల్లో పూర్తికాని పూడికల తొలగింపు



పెద్దగెడ్డ రిజర్వాయర్

సాలూరు:

పాలకుల పంతం రైతన్నకు శాపంగా మారింది. ఫిబ్రవరిలో ప్రారంభించిన పెద్దగెడ్డ కాలువల పూడికతీత పనులు జూలై నెల వచ్చినా పూర్తికాలేదు. నిబంధనల ప్రకారం పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్లను పనులు చేయొద్దంటూ మంత్రి ఆదేశాల మేరకు ప్రాజెక్టు అధికారులు నిలిపివేయించడమే దీనికి కారణమన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. పాలకులు పంతం వీడి పనులు జరిగేలా చూడాలని రైతన్నలు విన్నవిస్తున్నా కనికరించేవారే కరువయ్యారు.

మార్చి నెలలో నిలిచిన పనులు

స్టేట్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ఫండ్ నుంచి పెద్దగెడ్డ సబ్‌డివిజన్ పరిధిలో పూడికతీత పనులు చేపట్టేందుకు రూ.91.21 లక్షలు మంజూరయ్యాయి. ఈ నిధులతో ప్రాజెక్టు పరిధిలో ఉన్న కాలువల్లో పూడికతీత, గోడలు, మదుముల నిర్మాణం, తదితర పనులకు అధికారులు టెండర్లు ఆహ్వానించారు. టెండర్లు దక్కించుకున్న వారు నిబంధనల ప్రకారం 15 పనులు ప్రారంభించారు. దాదాపు 20 నుంచి 30 శాతం పనులు చేపట్టిన తరువాత కాంట్రాక్టర్లకు పెద్దగెడ్డ అధికారుల నుంచి పనులు నిలిపివేయాలన్న వార్త అందింది. వెంటనే గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణిను కలవాలని, ఆమె చేయమంటేనే పనులు పూర్తిచేయాలని, లేదంటే వద్దని చెప్పారు. కొందరు కాంట్రాక్టర్లు మంత్రిని కలిసినా ఒప్పందం కుదరక నిరాశతో వెనుదిరిగినట్టు సమాచారం. బిల్లులు రావన్న బెంగతో కాంట్రాక్టర్లు ఈ ఏడాది ఫిబ్రవరి నెలలో పనులు నిలిపివేశారు. చేసిన పనికి బిల్లులు చెల్లించాలని అధికారుల చుట్టూ తిరుగుతున్నా కాంట్రాక్టర్లకు నిరాశే ఎదురవుతోంది.

త్వరలోనే పూర్తిచేస్తాం

పెద్దగెడ్డ కాలువల్లో పూడిక తీత పనులు త్వరలోనే పూర్తిచేస్తాం. స్టేట్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ఫండ్ నుంచి పెద్దగెడ్డ సబ్‌డివిజన్ పరిధిలోని కాలువల్లో పూడికతీత పనులకు రూ.91.21లక్షలు మంజూరయ్యాయి.

-శ్రీనువాస్, పెద్దగెడ్డ డీఈ

క్లుప్తంగా

గుండాం సమీపంలో ఏనుగులు



జీడి తోటల్లో ఏనుగులు

సీతంపేట: సీతంపేట–కురుపాం మండల సరిహద్దు ప్రాంతమైన గుండాం గ్రామం వైపు ఏనుగులు వెళ్లినట్టు అటవీ శాఖ సిబ్బంది శనివారం తెలిపారు. గత పక్షం రోజులుగా నాలుగు ఏనుగులు మోహన్‌కాలనీ, గోరపాడు, చిన్నబగ్గ బీట్ పరిధిలో తిరిగి పైనాపిల్ పంటలను నాశనం చేశాయి. అరటి చెట్లను విరిచేశాయని స్థానికులు తెలిపారు. పంట నష్ట పరిహారం ఇచ్చే విధంగా అటవీ శాఖ చర్యలు తీసుకోవాలని గిరిజన రైతులు కోరుతున్నారు.

వ్యక్తిపై కేసు



నిప్పు పెట్టడంతో కాలిపోతున్న పూరి పాక

వీరఘట్టం: మండలంలోని హుస్సేనుపురంలో కొద్ది రోజులుగా ఇద్దరు వ్యక్తుల మధ్య నెలకొన్న స్థల వివాదం చిలికిచిలికి గాలివానలా మారింది. ఈ వివాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్.ఐ జి.కళాధర్ శనివారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి...హుస్సేనుపురానికి చెందిన బంధువులైన వావిలపల్లి సూర్యనారాయణ, బొత్స రామారావులకు కొద్ది రోజులుగా గ్రామంలో ఓ స్థల వివాదం నడుస్తోంది. తన స్థలంలో పూరిపాక వేశారంటూ రామారావు శనివారం ఉదయం ఆ పూరిపాకపై పెట్రోల్ పోసి నిప్పు పెట్టాడు. ఆ సమయంలో పూరిపాకలో ఉన్న సూర్యనారాయణ ప్రాణ భయంతో పరుగులు తీశాడు. ఈ ప్రమాదంలో సూర్యనారాయణ స్వల్పంగా గాయపడ్డాడు. సమస్యను సామరస్యంగా పరిష్కరించుకోవాల్సి ఉండగా ఇలా నిప్పు పెట్టి తనను భయభ్రాంతులకు గురిచేసిన రామారావుపై చర్యలు తీసుకోవాలని సూర్యనారాయణ పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు ఎస్.ఐ తెలిపారు.

గంజాయి నియంత్రణే లక్ష్యంగా తనిఖీలు



తనిఖీలు చేస్తున్న పోలీసులు

విజయనగరం క్రైమ్: జిల్లా వ్యాప్తంగా గంజాయి రవాణ నియంత్రణే లక్ష్యంగా పోలీసులు శనివారం తనిఖీలు నిర్వహించారు. రైళ్లలో గంజాయి రవాణా జరగకుండా ఉండేందుకు ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్‌లో లోకల్ పోలీసులు, జీఆర్‌పీ, ఈగల్, ఆర్‌పీఎఫ్ పోలీసులు, డాగ్ స్క్వాడ్ సంయుక్తంగా బృందాలుగా ఏర్పడి తనిఖీలు చేపట్టినట్టు ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. ఒడిశా రాష్ట్రం నుంచి ప్రధానంగా రవాణ అవుతున్న నేపథ్యంలో ఈ తనిఖీలు ముమ్మరం చేసినట్టు చెప్పారు. విజయనగరం వన్‌టౌన్ సీఐ ఎస్.శ్రీనివాస్ సిబ్బందికి ముందస్తుగా కొన్ని సూచనలు చేసి తనిఖీలపై అవగాహన కల్పించారు. తనిఖీల్లో తెర్లాం ఎస్ఐ సాగర్‌బాబు, జీఆర్‌పీ ఎస్ఐ మధుసూదనరావు, ఆర్‌పీఎఫ్ ఎస్ఐ శ్రీధర్, డాగ్ స్క్వాడ్ సిబ్బంది, 40 మంది సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సుధీర్

శృంగవరపుకోట: మండలంలోని కిల్తంపాలెం పంచాయతీ పరిధి నవోదయ విద్యాలయం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు మృతి చెందగా, మరో ముగ్గురు యువకులు గాయాల పాలయ్యారు. స్థానికులు అందించిన వివరాలు.. మండలంలోని లచ్చందొరపాలెం గ్రామానికి చెందిన కండిపల్లి సుధీర్(18) తన స్నేహితులతో కలిసి బొడ్డవర పంచాయతీ అంబదాసుపాలెం గ్రామానికి చెందిన నిఖిల్ ఆటోలో శుక్రవారం రాత్రి ముషిడిపల్లి బయలుదేరారు. వీరు ప్రయాణిస్తున్న ఆటో నవోదయ విద్యాలయం దాటగానే ఎదురుగా వస్తున్న టాటా ఏస్ వాహనాన్ని బలంగా ఢీకొట్టింది. ప్రమాదంలో సుధీర్ ప్రమాద స్థలంలో మృతి చెందగా, ఆటో నడుపుతున్న నిఖిల్, గణేష్, జగదీష్ గాయపడ్డారు. వీరిని ఎస్‌కోట ప్రభుత్వాసుపత్రికి తరలించగా, వీరిలో గణేష్ పరిస్థితి విషమంగా ఉండటంతో విశాఖ కేజీహెచ్‌కు రిఫర్ చేశారు. ఎస్.కోట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹90	₹150	₹160

నిర్లక్ష్యం..!

- గాల్లో కలిసిపోతున్న ప్రాణాలు
- విద్యుత్ ప్రమాదాలు బారిన పడి మరణిస్తున్న ప్రజలు, మూగజీవాలు
- విద్యుత్ శాఖ ఉద్యోగులు సైతం ప్రమాదాల బారిన పడి మృత్యువాత పడుతున్న వైనం
- 2024–25లో 30 మంది మృతి
- 16 మూగ జీవాల మృత్యువాత



ఈ ఫొటోలో కనిపిస్తున్న విద్యుత్ ఉద్యోగి పేరు రెహమాన్. జామి మండలం శాసనపల్లి గ్రామంలో జేఎల్ఎం(జూనియర్ లైన్‌మెన్ గ్రేడ్ 2)గా పని చేసేవాడు. నెల రోజుల కిందట సోమయాజులపాలెంలో విద్యుత్ స్తంభం ఎక్కి పనులు చేస్తుండగా విద్యుత్ సరఫరా కావడంతో మృతి చెందాడు. అందొచ్చిన కొడుకు మరణించడంతో కుటుంబంలో విషాదం అలుముకుంది.

ఎస్.కోట మండలం వేమాలపల్లి గ్రామంలో లగుడు ప్రదీప్ అనే యువకుడు పొలం నుంచి గడ్డి మోపు తీసుకుని వెళ్తుండగా వేలాడుతున్న విద్యుత్ వైర్ తగలడంతో మృతి చెందాడు. వివాహం అయిన నెల రోజులకే మృతి చెందడంతో ఆకుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది.

నెల్లిమర్ల మండలంలో గుషిణి గ్రామంలో కొద్ది నెలల క్రితం విద్యుత్ పనులు చేపట్టేందుకు జూనియర్ లైన్‌మెన్ (గ్రేడ్-2)గా పని చేసే కోటరావు విద్యుత్ స్తంభం ఎక్కాడు. ఈలోగా విద్యుత్ సరఫరా కావడంతో అక్కడిక్కడే మృతి చెందాడు.

విజయనగరం ఫోర్ట్: జిల్లాలో విద్యుత్ ప్రమాదాల బారిన పడి పలువురు మృత్యువాత పడుతున్నారు. ప్రజలతో పాటు పశువులు కూడా మృత్యువాత పడుతున్నాయి. విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం వల్ల ప్రజల ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి. విద్యుత్ శాఖ అధికారులు సమస్యలను సకాలంలో పరిష్కరించకపోవడం వల్ల ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.



విజయనగరం పైడిమాంబ కాలనీలోని సాయి కీర్తన నగర్‌లో స్లీవ్స్ ఎర్త్ లేని ట్రాన్స్‌ఫార్మర్

అలసత్వం

పొలాల్లో తెగిపడిన విద్యుత్ వైర్లు సకాలంలో సరిచేయకపోవడం, ఒరిగిన విద్యుత్ స్తంభాలు సరిచేయకపోవడం, ఇళ్లపై నుంచి వెళ్తున్న విద్యుత్ వైర్లును ఇళ్లకు దూరంగా జరపకపోవడం, విద్యుత్ స్తంభాలపై పిచ్చిక గుడులు మాదిరి కేబుల్ వైర్లును అమర్చినా వారిపై చర్య తీసుకోకపోవడం, విద్యుత్ మరమ్మతులు చేపట్టేటప్పుడు విద్యుత్ నిలిపివేతలో జాగ్రత్తలు తీసుకోకపోవడం తదితర కారాణాలు వల్ల విద్యుత్ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. తరుచూ ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు దిద్దుబాటు చర్యలు చేపట్టకపోవడం వల్ల ప్రమాదాలు జరిగి ప్రజలు మృత్యువాత పడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

సొంత స్తంభాల మాదిరిగానే..

విద్యుత్ స్తంభాలను కేబుల్ ఆపరేటర్లు సొంత స్తంభాల మాదిరి వాడుకుంటున్నారు. పట్టణాల్లోను, పల్లెలోను ఇదే పరిస్థితి. విద్యుత్ స్తంభాలకు కేబుల్ వైర్లు కట్టలుకట్టలుగా కట్టేస్తున్నారు. దీంతో విద్యుత్ పనులు చేపట్టేందుకు విద్యుత్ సిబ్బంది తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. విద్యుత్ శాఖ అధికారులు నిత్యం ఈ దృశ్యాలను చూస్తున్నా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

మెంటాడ మండలం మీసాలపేట గ్రామంలో పొలంలో కొన్నాళ్ల కిందట విద్యుత్ వైర్లు తెగిపడిపోయాయి. విద్యుత్ శాఖ అధికారులు వాటిని తీయలేదు. అదే గ్రామానికి చెందిన రైతు కోరాడ ఈశ్వరరావు పొలంలోకి వెళ్లగా కాలికి విద్యుత్ వైర్ తగలడంతో విద్యుత్ షాక్‌కు గురై చనిపోయాడు. భర్త రాలేదని పొలంలోకి అతని భార్య ఆదిలక్ష్మి వెళ్లింది. క్రింద పడి ఉన్న భర్తను లేపడానికి ప్రయత్నించగా ఆమె కూడా విద్యుత్ షాక్‌కు గురై చనిపోయింది.

నెల్లిమర్ల మండలం అల్తిపాలేంలో కేబుల్ ఆపరేటర్ వడ్డాది ఉమామహేశ్వరరావు విద్యుత్ స్తంభం లైనుకు కేబుల్ వైర్ పెడుతుండగా 11కేవీ వైర్ తగిలి చనిపోయాడు.

చర్యలు తీసుకుంటున్నాం..

విద్యుత్ ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నాం. విద్యుత్ సమస్యలపై సమాచారం వచ్చిన వెంటనే చర్యలు చేపడుతున్నాం. ప్రజలు విద్యుత్ ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

– మువ్వల లక్ష్మణరావు, ఎస్ఈ, ఏపీఈపీడీసీఎల్

వర్షాకాలంలో..

ప్రస్తుత వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాలు ఎక్కువగా జరిగే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. 2024–25లో 30 మంది విద్యుత్ ప్రమాదాలు వల్ల మృతి చెందారు. 16 పశువులు మృతి చెందాయి. 2025–26లో ఏప్రిల్ నుంచి జూన్ నెలఖారు నాటికి ఐదుగురు మృతి చెందగా.. నాలుగు మూగజీవాలు మృతి చెందాయి.

సమస్యల పరిష్కారానికి దివ్యాంగుల ఆందోళన

- మంత్రి పర్యటన సందర్భంగా కలెక్టర్ వద్ద నిరసన



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న దివ్యాంగులు

పార్వతీపురం టౌన్: దివ్యాంగుల సమస్యలకు పరిష్కారం చూపాలని దివ్యాంగుల పరిరక్షణ సేవా సమితి జిల్లా అధ్యక్షుడు ముంద్రంగి లచ్చన్న దొర డిమాండ్ చేశారు. శనివారం సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోల బాల వీరాంజనేయ స్వామి పర్యటన సందర్భంగా కలెక్టరేట్ వద్ద తమ సమస్యలను నిరసన రూపంలో తెలియజేశారు. అనంతరం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా నూతనంగా ఏర్పడి మూడేళ్లు అయినా నేటి వరకు దివ్యాంగుల సంక్షేమ శాఖ కింద సహాయక సంచాలకుల వారి కార్యాలయం పార్వతీపురంలో ఏర్పాటు చేయాలేదన్నారు. తద్వారా జిల్లాలో గల దివ్యాంగులంతా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. తక్షణమే ఏడీ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలన్నారు. గతంలో జిల్లాలో 4 అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా జరిగిన ఏఎల్ఐఎంసీవో క్యాంపులలో దివ్యాంగులకు మంజూరైన పరికరాలను వెంటనే ఇప్పించాలన్నారు. నిరసనలో పలువురు దివ్యాంగులు పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత



తిప్పలవలస గ్రామంలో అక్రమంగా నిల్వ వున్న పీడీఎస్ బియ్యం సీజ్ చేసిన పౌర సరఫరాల శాఖ అధికారులు

పూసపాటిరేగ: మండలంలోని తిప్పలవలస గ్రామంలో అక్రమంగా నిల్వ వుంచిన 40 బస్తాలు పీడీఎస్ బియ్యం పట్టుకొని కేసు నమోదు చేసినట్టు భోగాపురం సీఎస్‌డీటీ బీవీ మురళీకృష్ణ శనివారం తెలిపారు. గ్రామానికి చెందిన రాయితి లక్ష్మి ఇంట్లో వుంచిన పీడీఎస్ బియ్యాన్ని భోగాపురం, రాజాం, గజపతినగరం, గంట్యాడ సీఎస్‌డీటీలు మురళీకృష్ణ, ఎస్.చిరంజీవి, ఎన్.మూర్తి, కె.తిరుపతి బృందంగా ఏర్పడి తనిఖీలు నిర్వహించగా అక్రమంగా బియ్యం నిల్వ వున్నట్టు కనుగొని సీజ్ చేసినట్టు తెలిపారు. సీజ్ చేసిన బియ్యాన్ని భోగాపురం పౌర సరఫరాలు శాఖ గోడౌన్‌కు తరలించినట్టు తెలిపారు. నిందితులపై 6ఏ కేసు నమోదు చేసినట్టు తెలిపారు. దాడులలో వారితో పాటు వీఆర్వో టి.ఈశ్వర్రావు తదితరులు పాల్గొన్నారు.

పాచిపెంటలో..

పాచిపెంట: మండలంలో పి.కోనవలస చెక్‌పోస్ట్ వద్ద శనివారం వాహన తనిఖీలు చేపట్టగా కొత్తూరు మండలం కడుమ గ్రామం నుంచి ఒడిశా రాష్ట్రం నవరంగాపూర్‌కు తరలిస్తున్న పీడీఎస్ బియ్యం పట్టుబడ్డాయి. తనిఖీల్లో విజిలెన్స్ అధికారులు ఇన్‌స్పెక్టర్ సింహాచలం, సబ్ ఇన్‌స్పెక్టర్ రామారావు, పోలీస్ కానిస్టేబుళ్లు పురుషోత్తమ, తిరుపతిరావు మరియు రెవెన్యూ శాఖ అధికారి హేమలత, పాచిపెంట సీఎస్‌డీటీ పాల్గొన్నారు.

డ్రోన్ల సహాయంతో పోలీసుల దాడులు



డ్రోన్ల సాయంతో బహిరంగ మద్యం సేవిస్తున్న వారిపై పోలీసుల దాడులు

విజయనగరం క్రైమ్: బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న వారిపై పోలీసులు డ్రోన్ల సహాయంతో కొరడా ఝళిపిస్తున్నారు. జిల్లాలోని జామి పోలీస్‌స్టేషన్ పరిధి భీమసింగి, పెదమానాపురం పోలీస్ స్టేషన్ పరిధి మానాపురం సంత శివారు ప్రాంతాల్లో శనివారం ఓపెన్ డ్రింకింగ్ చేస్తున్న వారిపై డ్రోన్ల సహాయంతో శనివారం దాడులు చేశారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న వారిపై ఆకస్మికంగా డ్రోన్ల సాయంతో దాడులు చేస్తున్నారు. ఇలా మద్యం సేవిస్తున్న నలుగురిపై కేసులు నమోదు చేసినట్టు ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. పెదమానాపురం సంత వద్ద కూడా బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న ముగ్గురిని అదుపులోకి తీసుకొని వారిపై మూడు కేసులు నమోదు చేసినట్టు తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

పార్వతీపురం టౌన్: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న తెలుగు సబ్జెక్టు బోధించేందుకు గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టుకు దరఖాస్తులు కోరుతున్నట్టు ప్రిన్సిపాల్ ఆకుల రాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు కుల ధ్రువీకరణ పత్రంతో పాటు విద్యార్హత సర్టిఫికెట్లతో ఈ నెల 14న మధ్యాహ్నం రెండు గంటల్లోపు పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలి సూచించారు. దరఖాస్తుదారులకు ఈ నెల 15న ఉదయం 11 గంటలకు పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డీవీఈవో ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని తెలిపారు.

మర్యాదపూర్వక కలయిక



రాష్ట్ర మంత్రి బాల వీరాంజనేయస్వామికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్పీ మాధవ్‌రెడ్డి

పార్వతీపురం రూరల్: జిల్లా కేంద్రంలో శనివారం పర్యటించిన రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోల బాలవీరాంజనేయ స్వామిని ఎస్పీ ఎస్‌వీ మాధవ్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందజేశారు. పట్టణంలోని 1, 30 వార్డుల్లో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొని అతిథి గృహానికి వచ్చిన మంత్రిని ఎస్పీ అక్కడ కలిశారు.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న వేరొక లారీ



లారీ క్యాబిన్‌లో చిక్కుకున్న డ్రైవర్‌ను బయటకి తీస్తున్న అగ్నిమాపక సిబ్బంది

బొండపల్లి: ఆగి ఉన్న లారీని వెనుక నుంచి వచ్చిన మరో లారీ ఢీకొనడంతో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. బొండపల్లి ఎస్ఐ మహేష్ తెలిపిన వివరాలు...గొట్లాం బైపాస్ రోడ్డుపై శనివారం వేకువజామున ఆగి ఉన్న లారీని వెనుక నుంచి వచ్చిన మరో లారీ బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో ఢీకొట్టిన లారీ డ్రైవర్ రెల్లి నాయుడు లారీ క్యాబిన్‌లో ఇరుక్కొనిపోయాడు. విషయం తెలుసుకున్న ఎస్ఐ మహేష్ వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్నారు. క్యాబిన్‌లో చిక్కుకున్న డ్రైవర్‌ను రక్షించడానికి ప్రయత్నించడగా ఫలితం లేకపోవడంతో తక్షణమే జిల్లా కేంద్రంలో ఉన్న అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వారొచ్చి రోప్‌లు, కట్టర్లతో శ్రమించి డ్రైవర్‌ను సురక్షితంగా బయటకు తీసి చికిత్స కోసం 108లో జిల్లా కేంద్ర సర్వజన ఆసుపత్రికి తరలించారు.

ధర్నాలు, ర్యాలీలు, సమావేశాలకు అనుమతులు తప్పనిసరి

విజయనగరం క్రైమ్: విజయనగరం పోలీసు సబ్ డివిజన్ పరిధిలో ధర్నాలు, ర్యాలీలు, సమావేశాలు, రాస్తారోకోలు వంటి వాటికి ముందస్తు అనుమతులు తప్పనిసరని డీఎస్పీ ఎం.శనివారం శనివారం తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా సెక్షన్ 30 నెల రోజుల పాటు అమల్లో ఉంటుందన్నారు. ప్రజలు దీనికి సహకరించాలని కోరారు.

జొన్నవలస రైల్వేగేటు వద్ద మృతదేహం లభ్యం



గుర్తు తెలియని మృతదేహం

విజయనగరం క్రైమ్: జొన్నవలస రైల్వే గేటు వద్ద గుర్తు తెలియని మృతదేహాన్ని జీఆర్‌పీ పోలీసులు శనివారం గుర్తించారు. 25 - 30 ఏళ్ల మధ్య వయసు గల వ్యక్తి నీలి రంగు ఫ్యాంట్, రెడ్ నెక్ టీ షర్ట్ కలిగిన వ్యక్తిగా గుర్తించినట్టు జీఆర్‌పీ హెచ్‌సీ కృష్ణ చెప్పారు. కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు. గుర్తించిన వారు తమను సంప్రదించాలని సూచించారు.

ఉన్నత విద్యా నైపుణ్యాలతో దేశాభివృద్ధి



యూనివర్సిటీ ప్రాక్టికల్ ల్యాబ్‌లను సందర్శించిన రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు

- రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు

విజయనగరం అర్బన్: ఉన్నత విద్యా నైపుణ్యాలు దేశాభివృద్ధికి తోడ్పడతాయని రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు అన్నారు. విద్యతో పాటు ఉద్యోగ, ఉపాధి మార్గాలనూ నేర్పుతున్న సెంచూరియన్ విశ్వవిద్యాలయం భవిష్యత్‌లో ఎంతో మందికి ఉన్నతమైన ఉద్యోగ అవకాశాలు కలిపిస్తుందని ఆయన ఆకాంక్షించారు. విశ్వ విద్యాలయ చాన్సలర్ డాక్టర్ జీఎస్ఎన్‌రాజు ఆహ్వానం మేరకు శనివారం విశ్వవిద్యాలయాన్ని డాక్టర్ శంకరరావు సందర్శించారు. ఈ సందర్భంగా వివిధ విభాగాలను పరిశీలించడంతో పాటు అక్కడ విశేషాలను అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయ రంగంతోపాటు మెకానికల్, వైద్య తదితర విభాగాలలో విశ్వవిద్యాలయం అందిస్తున్న విద్యావకాశాలను చాన్సలర్ వివరించారు. స్కిల్ డెవలప్మెంట్ కార్యక్రమంలో భాగంగా మహిళలు కుట్టుమని నేర్చుకుని ఆదాయ మార్గాలను పెంచుకోవడాన్ని డాక్టర్ శంకరరావు ఈ సందర్భంగా అభినందించారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి



గంధవరపు అప్పాలు(ఫైల్)

గజపతినగరం: మండలంలోని భూదేవిపేటకు చెందిన గంధవరపు అప్పాలు(71) శనివారం రైలు పట్టాలు దాటుతుండగా గుర్తు తెలియని రైలు ఢీకొని మృతి చెందాడని బొబ్బిలి రైల్వే హెచ్‌సీ బి.ఈశ్వరరావు తెలిపారు. అప్పాలు తన సొంత గ్రామం భూదేవిపేట గ్రామం నుంచి ఆరోగ్య తనిఖీ నిమిత్తం మరుపల్లి గ్రామంలో ఉన్న పీహెచ్‌సీకి బయలుదేరారు. మార్గ మధ్యలో రైల్వే ట్రాక్ ఉండడంతో దాన్ని దాటుతుండగా విజయనగరం నుంచి బొబ్బిలి వైపు వెళ్తున్న గుర్తు తెలియని రైలు ఢీకొనడంతో అప్పాలు అక్కడికక్కడే మృతి చెందాడని హెచ్‌సీ తెలిపారు. అనంతరం మృతదేహాన్ని ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. మృతుడు గ్రామంలో పూజారిగా ఉంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈయనకు ముగ్గురు కుమారులు ఉన్నారు.

గంజాయితో ముగ్గురి యువకుల అరెస్టు



గంజాయి తరలిస్తున్న యువకులను పట్టుకున్న గుర్ల పోలీసులు

గుర్ల: మండలంలోని మణ్యపురిపేట వద్దనున్న తారకరామ తీర్థ సాగర్ కాలువపై గంజాయి అమ్మకాలు చేస్తున్న ముగ్గురు యువకులను అరెస్టు చేసినట్టు ఎస్ఐ పి.నారాయణ రావు శనివారం తెలిపారు. మణ్యపురిపేట వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ముగ్గురు యువకులు అనుమానాస్పదంగా ఉండడంతో వారి బ్యాగులను తనిఖీ చేయగా కేజీ గంజాయిని పట్టుకొని స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. గంజాయి తరలిస్తున్న వారిలో గరికివలసకు చెందిన ఆవాల రాజేష్, కెల్లకు చెందిన మీసాల రమేష్ , పూసపాటిరేగకు చెందిన మంత్రి రామారావు ఉన్నారని వారిని అరెస్ట్ చేసి ద్విచక్ర వాహనం, సెల్‌ఫోన్ సీజ్ చేసామని చెప్పారు. గంజాయి కేసులో ముగ్గురిని అరెస్ట్ చేయడంతో గుర్ల పోలీస్ సిబ్బందిని డీఎస్పీ రాఘవులు, సీఐ శంకరరావు అభినందించారు.

గోడను బైక్ ఢీకొని బాలుడు మృతి



ప్రణీత్ (ఫైల్)

విజయగరం క్రైమ్: విజయనగరం మండలం ధర్మపురి రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో పిన్నింటి ప్రణీత్(15) మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే.. కొత్తపేటకు చెందిన ప్రణీత్ తన ఇద్దరి స్నేహితులతో బైక్‌పై ఈ నెల 9న సింహాచలం గిరి ప్రదక్షిణకు వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో భీమిలి రోడ్డు మీదుగా ధర్మపురి రోడ్డులోకి వస్తున్న బైక్ రోడ్డు పక్కనే ఉన్న ఓ ఇంటి గోడను బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా గాయపడడంతో విజయనగరంలోని ఆసుపత్రిలో చేర్చారు. అక్కడ చికిత్స పొందుతూ ప్రవీణ్ శనివారం మృతి చెందినటుట రూరల్ ఎస్ఐ అశోక్ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.